సమాజాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులు భాగస్వామ్యమవ్వాలి

- మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులు భాగస్వామ్యం అవ్వాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని జివివి ఫంక్షన్ హాల్లో ఆర్‌టిసి ఉద్యోగి, టిఎంయు సీనియర్ నాయకుడు బెల్లి నరసయ్య పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఆర్‌టిసి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి నరసయ్య చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. 36 ఏళ్ల పాటు ఆర్‌టిసికి సేవలందించి పదవి విరమణ పొందుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విరామం తర్వాత కుటుంబానికి సమయం కేటాయించడంతోపాటు సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవడానికి విశ్రాంత ఉద్యోగులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో పాలుపంచుకోవడానికి తనతో కలిసి నడవాలని మంత్రి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జ్యోతి కరుణాకర్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లింగ సమానత్వం తర్వాతే ఏకత్వం

- వ్యక్తిగత చట్టాల మార్పులతోనే ఏకరూప పౌరస్మృతి అమలు సాధ్యం
- మణిపూర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- ఆ రాష్ట్ర సిఎం రాజీనామా చేయాలి
- టిఎస్‌యుటిఎఫ్ సమావేశంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

' ఏకరూప పౌరస్మృతి కంటే ముందు వ్యక్తిగత చట్టాల్లో మార్పులు రావాలి. భిన్న మతాలు, సంస్కృతులకు నిలయమైన భారత దేశంలో వివిధ మతాల వ్యక్తి గత చట్టాల్లో (పర్సనల్ లాస్) గల వివక్షను తొలగించిన అనంతరం మాత్రమే ఏకరూప పౌరస్మృతి అమలు సాధ్యమౌతుంది. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికలకు ముందు బిజెపి ప్రభుత్వం పౌరస్మృతిని ముందుకు తీసుకోస్తోంది' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షతన ' ఏకరూప పౌరస్మృతి, మణిపూర్ పరిణామాలు' అంశంపై నిర్వహించిన అధ్యయన వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని మతాల్లో వ్యక్తి గతచట్టాల్లో మహిళల పట్ల వివక్ష ఉందని, కులాల అంతరాలు, సామాజిక వివక్ష కొనసాగుతోందన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం వస్తేనే ఏకత్వం సాధ్యమవు తుందని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా పౌరులకు కల్పించిన హక్కులకు అనుగుణంగా మతాల వ్యక్తిగత చట్టాలు లేవని, మెజారిటీ మతం వ్యక్తిగత చట్టాలనే తమపై రుద్దుతారనే భావన మైనారిటీల్లో ఉందని చెప్పారు. ఇటువంటి అసమానతలు, అభద్రతా భావాల మధ్య తీసుకువచ్చే ఏకరూప పౌరస్మృతి జాతీయ సమైక్యతకు మేలు కంటే కీడు ఎక్కువ చేస్తుందన్నారు. ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను విడుదల చేయకుండా చర్చ పెట్టటం కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టి, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికేనని విమర్శించారు. గోవాలో ఏకరూప పౌరస్మృతి అమలవుతుందని బిజెపి తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ఉత్తరఖాండ్‌లో గిరిజనులకు, ఈశాన్య రాష్ట్రాలకు ఏకరూప పౌరస్మృతి వర్తించదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. దీన్ని దేశం కోసం కాకుండా ముస్లింల కోసమే తీసుకురావడానికి బిజెపి సర్కార్ కుట్ర చేస్తున్నదని అన్నారు. మేధావులు, లౌకిక, ప్రజాస్వామిక వాదులు పాలకుల ఎత్తుగడలను అవగాహన చేసుకుని ప్రజల మధ్య ఐక్యతకు కృషి చేయాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యమే మణిపూర్ మారణహోమానికి కారణమన్నారు. మణిపూర్‌లోని కుకీ తెగ ప్రజలపై మెజారిటీ తెగ మెయితీలు దాడులు చేస్తున్నారని అన్నారు. ఆస్తుల ధ్వంసం, మహిళలపై పైశాచిక వేధింపులకు రాష్ట్ర ప్రభుత్వం పరోక్షంగా సహకరించిందని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లోని అటవీ, ఖనిజ సంపదపై కన్నేసిన కార్పొరేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం ప్రజల మధ్య మత చిచ్చు రగిల్చి దారుణ మారణహోమానికి పాల్పడుతున్నారన్నారు. ప్రధాన మంత్రి మౌనం సమర్థనీయం కాదన్నారు. అఖిల పక్షం పర్యటించి శాంతి, సామరస్యం నెలకొల్పాలని, బాధితులకు బాసటగా నిలవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సెమినార్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావరవి, స్టడీ సర్కిల్ కన్వీనర్ కె.సోమశేఖర్, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, పత్రిక సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఈ.గాలయ్య, కె.రవికుమార్, జి.నాగమణి, ఎ.సింహాచలం, డి.సత్యానంద్, ఎస్‌వై.కొండలరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిస్తున్న గోదావరి

- భద్రాచలం ఏజెన్సీలో తగ్గుముఖం
- ఊపిరి పీల్చుకున్న ఏజెన్సీ వాసులు
- పునరావాస కేంద్రాల్లోనే వరద బాధితులు
- రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉరుకులు, పరుగులతో ఏజెన్సీ వాసులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిన గోదారమ్మ ఎట్టకేలకు శాంతించింది. శనివారం అర్ధరాత్రి నుంచి గోదావరి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద 53 అడుగులు దాటి గోదావరి ప్రవహించడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన విషయం విదితమే. 56 అడుగులకుపైగా గోదావరి ప్రవహించింది. ఆదివారం ఉదయం 9 గంటలకు 54.70 అడుగులు ఉన్న గోదావరి, రాత్రి 9 గంటలకు 49.50 అడుగులకు తగ్గింది. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పలు ప్రధాన రహదారులపైకి చేరిన వరద నీరు తొలగడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలకు వీలు కలిగింది. వరద బాధితులు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. పూర్తి స్థాయిలో గోదావరి తగ్గుముఖం పట్టిన అనంతరం ఎవరెవరి ఇళ్లు ముంపుకు గురయ్యాయో, పంట నష్టంపై అధికారులు సర్వే జరిపి త్వరలోనే అంచనాలు వేయనున్నారు.

బూర్గంపాడు మండలం సారపాక ఐటిసిలో పునరావాస కేంద్రాన్ని సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు సందర్శించి బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. బూర్గంపాడు జడ్‌పిటిసి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. గోదావరి ముంపు ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ చేశాయి. భద్రాచలం, బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాలకు రోడ్లపై వరద నీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. మున్నేరు ముంపు ప్రాంతాలైన ఖమ్మం నగరంలోని మోతీనగర్, దంసలాపురం, అగ్రహారం, బొక్కల గడ్డ, ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్, పెద్ద తండాలో పట్టణానికి చెందిన పల్లా కిరణ్‌కుమార్ నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. అశ్వాపురం మండలంలోని ముంపు ప్రాంతాల్లో టీపీసీసీ సభ్యులు పోలేబోయిన శ్రీవాణి పర్యటించారు.

బిసి బంధు సద్వినియోగం చేసుకోవాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వయం ఉపాధి పొందేలా సిఎం కెసిఆర్ ఇస్తున్న బిసి బంధుని సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట వయోలా గార్డెన్స్‌లో ఆదివారం బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో కులవృత్తుల ప్రోత్సహం కోసం రూ.లక్ష గ్రాంట్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై.. రాష్ట్రంలోనే తొలిసారిగా సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని 300 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కులవృత్తులను బలోపేతం చేయాలని సిఎం కెసిఆర్ ఆలోచించి.. వృత్తిపైన ఆధారపడిన వారందరికీ ప్రోత్సాహకంగా రూ.లక్ష గ్రాంట్ అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు బ్యాంకు లింకేజీ పేరిట బిసిలకు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ, బ్యాంకులు 40 శాతం పెడుతూ తదితర కొర్రీలతో ఎన్నో లింకులు ఉండేవి, ఆ రుణం కోసం షూరిటీ కావాలని తిరిగి తిరిగి చెప్పులరిగేవని గుర్తు చేశారు. సిఎం కెసిఆర్ షూరిటీ, డాక్యుమెంట్స్ లేకుండా నేరుగా గ్రాంట్ రూపంలో రూ.లక్ష అందిస్తున్నారని తెలిపారు.

తెలుగు భాష పరిరక్షణే సినారెకు నివాళి

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగరరావు

ప్రజాశక్తి-కల్చరల్

కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ప్రాంతీయ భాషలు అంతరించిపోతున్నాయని, తెలుగు భాష పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడాలని మహరాష్ట్ర పూర్వ గవర్నర్ సి.హెచ్.విద్యాసాగరరావు అన్నారు. సినారెకు నివాళిగా ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ నిర్వహణలో సినారె 92వ జయంతి సందర్భంగా విఖ్యాత హిందీ కవి జావీద్ అక్తర్ సినారె పేరిట విశ్వంభర పురస్కారం ప్రదానోత్సవ సభ ఆదివారం జరిగింది.

ముఖ్య అతిథిగా విద్యాసాగరరావు పాల్గొని ట్రస్ట్ పక్షాన రూ.ఐదు లక్షల చెక్కు, జ్ఞాపిక, ప్రసంశా ఫలకాన్ని బహూకరించి మాట్లాడారు. అక్షర సేద్యం చేసిన సినారె విశ్వంభర కావ్యంలో మానవుడు భౌగోళంల సంబందాలను తాత్వికంగా చెప్పారన్నారు. ఆయన కవిత్వం కాలానుగుణంగా సమనవ్యయంగా మానవీయత సిద్ధాంతంగా కవిత్వం రాశారని అన్నారు. అక్తర్ వామపక్ష భావజాలం కలవారని, ఆయన సలీంతో కలిసి రాసిన నాటి సినిమాలు దీవార్ షోలే వంటివి మరుపురానివని అన్నారు. సినారె జ్ఞాన కేంద్రం తన గ్రామంలో నిర్మిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాఖా మంత్రి నిరంజన్‌రెడ్డి సినారె రచించిన సమవ్యం వ్యాస సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. జావీద్ అక్తర్ ప్రగతి శీల మానవతావాది, సినరే అభ్యుదయ మానవతావాది అని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ, ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, దీపక్ మహాన్, సినారె మనువడు లయ చరణ్, మనుమరాలు మనస్విని, వై.లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

కూలర్ వైరే చిన్నారి పాలిట యమపాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడేండ్ల చిన్నారి పాలిట కూలర్ వైరే యమపాశమైంది. అప్పటి వరకు తల్లిదండ్రుల కండ్ల ముందే సంతోషంగా గంతలేస్తూ ఆడుకున్న చిన్నారి.. అంతలోనే మృత్యు ఒడిలోకి చేరుకోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాదకర సంఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దరావత్ భాస్కర్-కళ్యాణి దంపతులు ఇంటి వద్ద పని చేసుకుంటుండగా వారి కుమారుడు మూడేండ్ల అర్జున్ ఇంటి పక్కనే ఉన్న అమ్మమ్మ కాంతమ్మ ఇంట్లో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న కూలర్ వైర్లు పట్టు కోవడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన తల్లితండ్రులు వెంటనే చిన్నారిని మహబుబాబాద్ దవాఖానకు తీసుకవెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ముడెండ్లకే చిన్నారి మృతి చెందటంతో తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం బాధాకరం

- ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతి పిన్న వయసులో తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో ఎదుగుతున్న గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుమారుని కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయిన పచాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆదివారం ఆమె పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్షల మంది ప్రజలకు నిరంతరం సేవ చేసే ఎమ్మెల్యే జిఎంఆర్‌కు పుత్రశోకం కలగడం తనను దిగ్భ్రాంతిని గురిచేసిందన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

జిఓ ఉన్నా... అమలు సున్నా

- ఉపకార వేతన పెంపు లేక ఎనిమిదేళ్లు
- సర్కారుతో తాడోపేడో తేల్చుకుంటామంటున్న పిజిలు, హౌస్ సర్జన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'దేశ వైద్యారోగ్య రంగంలో రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. చాలా కొలమానాల్లో నీతి ఆయోగ్ ర్యాంకుల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. కేరళ, తమిళనాడు తర్వాత పలు విషయాల్లో మనమే అగ్రగామి. మూడో స్థానంతో సరిపెట్టుకోవద్దు. మొదటి స్థానంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి....' ఇది వైద్యారోగ్యశాఖ మంత్రి దగ్గర నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ తమ సిబ్బందికి పదే పదే చెప్పే మాట. తెలంగాణ వైద్యరంగంలో దేశంలోనే మూడో స్థానంలోకి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలతోపాటు వైద్య, నర్సింగ్ సిబ్బంది చేసిన కృషి కూడా కారణం. అదే సిబ్బంది తమకున్న అనేక సమస్యలను ఉన్నతాధికారుల నుంచి ప్రజా ప్రతినిధులు, మంత్రుల వరకూ ఏకరవు పెడుతున్నా పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

వైద్య విద్యార్థులకు ప్రతి రెండేండ్లకు ఒకసారి 15 శాతం చొప్పున ఉపకారవేతనాలు పెంచాలనే ఉత్తర్వులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి అమల్లో ఉన్నాయి. అవి అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా ఆయుష్ విద్యార్థులకు కూడా వర్తిస్తాయి. హైదరాబాద్ రామాంతపూర్‌లోని హోమియో వైద్య కళాశాలలో చదువుకుంటూ సేవలందిస్తున్న పిజిలు, హౌస్ సర్జన్లకు చివరిసారిగా 2014లో (తెలంగాణ ఏర్పడక ముందు) 15 శాతం ఉపకార వేతనం పెంపును అమలు చేశారు. ఆ పెంపుతో హౌస్ సర్జన్లకు నెలకు రూ.10,500, పోస్ట్ గ్రాడ్యుయేట్లు మొదటి సంవత్సరం విద్యార్థులకు

రూ.23,800, రెండో సంవత్సరం విద్యార్థులకు రూ.25,128, మూడో ఏడాది విద్యార్థులకు రూ.26,450 ఇస్తున్నారు. గత ఎనిమిదేండ్లతో పెంపుదల జిఒను అమలు చేయకపోవడంతో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని తట్టుకుంటూ వారు వీటితోనే నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పిజిలకు వరసగా రూ.35,589, రూ.37,566, రూ.39,543 ఇస్తుండగా, దేశంలో మొదటి స్థానంలో ఉన్న కేరళలో పీజీలకు వరసగా రూ.42,560, రూ.45,600, రూ.48,640 ఇస్తున్నారు. ప్రస్తుతం హోమియో వైద్యకళాశాలలో 109 మంది పీజీలు ఉండగా, వంద మంది వరకు హౌజ్ సర్జన్ సేవలందిస్తున్నారు.

ముగ్గురు మంత్రులకు వినతులు

తమకు ఉపకారవేతనాలను పెంచాలని పీజీలు, హౌజ్ సర్జన్లు గతంలో వైద్యారోగ్యశాఖ మంత్రులుగా పని చేసిన డాక్టర్ సిహెచ్.లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్‌తోపాటు ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును సైతం కలిసి విన్నవించుకున్నారు. గతంలో పని చేసిన ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి కెటిఆర్‌కు ట్వీట్ చేయడమే కాకుండా 2018 ఎన్నికల ముందు కూడా కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది జరిగే కళాశాల వార్షికోత్సవానికి వచ్చే స్థానిక ఎమ్మెల్యేతోపాటు ముఖ్యనేతల ముందు కూడా తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. నేతలు కలవడం, హామీలివ్వడం వరకే పరిమితం కాగా అవి అమలుకు మాత్రం నోచుకోవటం లేదు. దీంతో విద్యార్థులు ఈ సారి ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నాలుగు రోజులుగా ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నాలతో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

వారం రోజుల్లో అమలు చేయాలి

ఉపకారవేతనాల పెంపు జిఒను వారం రోజుల్లో అమలు చేయాలని హోమియో వైద్య విద్యార్థులు ప్రభుత్వానికి హెచ్చరించారు. లేకపోతే విధులు బహిష్కరిస్తామని విద్యార్థి నాయకులు డాక్టర్ సంతోష్, డాక్టర్ శివరాజు, డాక్టర్ వినయ్, డాక్టర్ అశీష్, డాక్టర్ షణ్ముఖ్, డాక్టర్ రతన్ హెచ్చరించారు. 2014తో పోలిస్తే నిత్యావసర వస్తువులు, వసతి సౌకర్యాలు, ప్రయాణ ఖర్చులు, ఇతర ఖర్చులు పెరిగిపోయాయనీ, పాత ఉపకారవేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

రైతు సమస్యలపై దశలవారీ ఆందోళనలు

- ఆగస్టు మొదటివారంలో ఎంపిలకు వినతిపత్రాలు
- వచ్చే నెల 9,10 తేదీల్లో నిరవధిక ధర్నాలు
- నవంబర్‌లో ఉమ్మడి జిల్లాల వారీగా బస్సుయాత్రలు :ఎస్‌కెఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతాంగానికి రాతపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం దశల వారీగా ఆందోళనలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఆగస్టు మొదటివారంలో ఎంపిలకు వినతిపత్రాలు, వచ్చేనెల 9,10 తేదీల్లో నిరవధిక ధర్నాలు నిర్వహించాలని పేర్కొంది. నవంబర్‌లో ఉమ్మడి జిల్లాల వారీగా బస్సుయాత్రలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపింది. ప్రజాసంఘాలతో కలిసి రైతాంగ హక్కుల కోసం ఉద్యమించనున్నట్టు పేర్కొంది. అక్టోబర్ 26,27,28 తేదీల్లో ఢిల్లీలో మహాపడావ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఆదివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, పశ్యపద్మ, వి.ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, బి. ప్రసాద్ తదితరులు విలేకర్లతో మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పూనుకుంటామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లుని ఉపసంహరించాలని కోరారు. ఏకకాలంలో రైతుమాఫీ చేయాలనీ, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అనుకూలంగా ఫసల్ బీమా పథకాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్రంలో అర్హులైన పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలనీ, కౌలు రైతులను గుర్తించి, వారికి రుణార్హత కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణభారంతోనే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రుణవిమోచన చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్‌లోని లోపాలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌కెఎం సదస్సులో రైతు, వ్యవసాయ, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారన్నారు. ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో కమిటీల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రైతు ఉద్యమ సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు ఎస్‌కెఎం పెద్ద ఎత్తున పోరాడుతుంన్నదని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE IInd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD

O. S. No: 1209 of 2019

Between:
State Bank of India, RACPC-III, Hyderabad - 500029. ...Plaintiff
AND
Mrs. Susmitha Swapna Kumari, ...Defendant

To Mrs. Susmitha Swapna Kumari, D/o Prabhu Das, aged 40 Years, Occ: Doctor, R/o Plot No. 10, Saikrupa Enclave, Nethaji Nagar, Nagaram, Hyderabad-500083.

NOTICE

Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on **14.08.2023.** Hence your are hereby directed to appear before the said court on **14.08.2023 at 10.30 AM** personally or through an advocate failing which the matter will be heard in your absence.

//By order of the Court//
B. Sriram Kartik, S Kishore, Advocates, Plot No.22, Sri Sai Nagar Colony, Road No.4, GSI Post, Hyderabad-500068.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE : KURNOOL.

O.S.NO. 30/2021

శ్రీమతి M. పద్మ. rep.by her G.P.A. Holder
శ్రీమతి M. మౌనిక ..... Plaintiff
Vs
శ్రీమతి M. లక్ష్మి దేవమ్మ మరియు 14 ఇతరులు ..... Defendants

7వ ప్రతివాదికి సమన్లు : కమ్మ మాదాల ప్రసాద్, S/o. లేట్ M. వెంకట నరసయ్య, R/o. Flat No. 205, సాయి స్పెక్ట్రా, స్ట్రీట్ నెంబర్ 3, Czech colony, సనత్ నగర్-2, హైదరాబాద్ సిటీ - 500018 తెలంగాణా రాష్ట్రము.

సమన్లు

ఇందుమూలముగా పైన కనబరచిన దావాలో 7వ ప్రతివాది ఐన నీకు తెలియజేయడమేమనగా పైన కనబరిచిన వాది మీపై మరియు ఇతరులపై తమ కుటుంబ ఆస్తిలో తన భాగము కోరుతూ దాఖలు చేసిన పై దావాలో నీపై సమన్లు జారీకై 18-08-2023వ తేదీకి వాయిదా ఉన్నది. పై దావాపై నీకేమైనా ఆక్షేపణలున్న యడల 18-08-2023వ తేదీ ఉదయం 10-30 ని. లకు పై కోర్టు ముందు ఖుద్దునగానీ, కానీ వకీలు ద్వారా కానీ హాజరై తెలుపుకోగలవు. అట్లుకానిపక్షమున, పై దావా నీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

(BY THE ORDER OF THE COURT)
M. INDRA VIJAYA RAO, B.A.B.L.
Advocate For Plaintiff
41/473-K, Opp : District Court, Kurnool-518 001 (A.P.)
9491408389, 08518-222246

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE : KURNOOL.

I.A.No.71/2021 in O.S.NO. 30/2021

శ్రీమతి M. పద్మ. rep.by her G.P. A Holder
శ్రీమతి M. మౌనిక ..... Petitioner/Plaintiff
Vs
శ్రీమతి M. లక్ష్మి దేవమ్మ మరియు 14 ఇతరులు ..... Respondents/Defendants

7వ రెస్పాండెంట్‌కు నోటీసు : కమ్మ మాదాల ప్రసాద్, S/o. లేట్ M. వెంకట నరసయ్య, R/o. Flat No. 205, సాయి స్పెక్ట్రా, స్ట్రీట్ నెంబర్ 3, Czech colony, సనత్ నగర్-2, హైదరాబాద్ సిటీ - 500018 తెలంగాణా రాష్ట్రము.

సమన్లు

ఇందుమూలముగా పైన కనబరచిన దావాలో 7వ ప్రతివాది ఐన నీకు తెలియజేయడమేమనగా పైన కనబరచిన వాది మీపై మరియు ఇతరులపై తమ కుటుంబ ఆస్తిలో తన భాగము కోరుతూ దాఖలు చేసిన పై దావాలో బాడుగదారులను కోర్టునందు బాడుగను డిపాజిట్లు చేయమని ఆర్డరుజారీ కొరకై పిటీషనర్ దాఖలు చేసిన I.A.No.71/2021 in O.S.No. 30/2021 లో నీపై నోటీసు జారీకై 18-08-2023వ తేదీకి వాయిదా ఉన్నది. పై పిటీషనుపై నీకేమైనా ఆక్షేపణలున్న యడల 18-08-2023 వ తేదీ ఉదయం 10-30 ని. లకు పై కోర్టు ముందు ఖుద్దునగానీ, వకీలు ద్వారా కానీ హాజరై తెలుపుకోగలవు. అట్లుకాని పక్షమున, పై దావా నీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

(BY THE ORDER OF THE COURT)
M. INDRA VIJAYA RAO, B.A.B.L.
Advocate For Plaintiff
41/473-K, Opp : District Court, Kurnool - 518 001 (A.P.)
9491408389, 08518-222246

IN THE COURT OF THE HON'BLE XXV ADDL.CHIEF JUDGE CITY CIVIL COURTS AT :: HYDERABAD.

O.P.No. **1386** of **2019**

Between: -
Gondhi Satyanarayana ...Petitioner.
And
Yeddulla Uttam Reddy and others ...Respondents.

To:
Respondent No.1.
Yedulla Uttam Reddy S/o Y. Pulla Reddy, Age: Major, Occ: Owner of DCM bearing No. AP-28TA-6000, R/o: H.No. 204/2, Subash Nagar, IDA Jeedimetla, Quthbullapur, Ranga Reddy Dist., Telangana state.
...Respondent No. 3.
Sanjay Kumar S/o Aghamayya, Age: Major, Occ: Driver of DCM bearing No. AP-28TA-6000, R/o: H.No. 13-117, IDA Bollaram, Jinnaram, Medak dist.

Please take notice that the above case filed for compensation under motor vehicle act, against you and others by the petitioner and the said case has been posted to 03-08-2023 for your appearance before this Hon'ble court therefore you are here by summoned to appear before the above cited Hon'ble court on **03-08-2023** at **10.30** a.m., either in person or through duly instructed advocate failing which an order will be passed against you

"BY ORDER OF THE COURT"
A. SREEDAR REDDY
Advocate
H.No.8-6-822, Christian Colony, Sagar Road, Opp. Naveena School, Hastinapuram, Hyderabad-70.
Cell : 9848512558

నేడు రాష్ట్రానికి కేంద్ర బృందం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరద నష్టాన్ని అంచనా వేయడానికి సోమవారం రాష్ట్రంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించనున్నదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అధికారుల బృందంలో వ్యవసాయ, ఆర్థిక, జలశక్తి, విద్యుత్, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖల అధికారులు, స్పేస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు ఉంటారని తెలిపారు. ఆ బృందానికి నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ (డీఎంహెచ్) సలహాదారులు కునాల్ సత్యార్థి నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ బృందం పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనావేయడంతోపాటుగా.. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న వివరాలను కూడా జతపరుస్తూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది.

ట్యాంకుబండ్‌పై కారు బీభత్సం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఆదివారం కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఎన్‌టిఆర్ మార్గ్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన కారు.. హుస్సేన్‌సాగర్ గ్రిల్స్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. ప్రమాద సమయంలో అందులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. కారులోని ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం వారిద్దరూ కారు వదిలి పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. క్రేన్ సహాయంతో కారును తొలగించారు.

త్వరలోనే రుణమాఫీ..?

- రూ.లక్ష వరకూ అన్నదాత అప్పులు చెల్లింపు
- సిఎం కెసిఆర్ యోచన
- ప్రతిపక్షాల నోరు మూయించటమే లక్ష్యం
- రైతు బంధు, బీమాతోపాటు రుణమాఫీని కూడా ఎన్నికల్లో వాడుకునే వ్యూహం
- కాంగ్రెస్ ప్రకటించకముందే వెల్లడించనున్న గులాబీ దళపతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న శాసనసభ ఎన్నికల కోసం సిఎం కెసిఆర్ తన అమ్ములపొదిలోంచి మరో అస్త్రాన్ని వదలనున్నారా..? అంటే అవుననే అంటున్నాయి బిఆర్ఎస్ వర్గాలు. ఇదే విషయాన్ని ఇటు అధికారులు సైతం ధృవీకరిస్తున్నారు. ఆ అస్త్రమే రైతు రుణమాఫీ. కారు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా ఆ పార్టీకి ప్రతి ఎన్నికల్లోనూ ఓట్లను గుమ్మరించాయి. కానీ రుణమాఫీ చేయకపోవటాన్ని ప్రతి పక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ప్రతీసారి ఎత్తి చూపుతూ వస్తోంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు అది కూడా ఆగస్టు, సెప్టెంబరు లోపే రుణమాఫీ చేయటం ద్వారా ప్రతిపక్షాల నోళ్లను మూయిం చేందుకు కెసిఆర్ వ్యూహం పన్నుతున్నారు. తద్వారా అన్ని రకాలుగా ఆదుకుంటున్నాం కాబట్టి.. మాకే ఓట్లేయాలంటూ ఆయన అన్నదాతలకు విజ్ఞప్తి చేయనున్నారు. మరోవైపు 'అబ్ కీ బార్-కిసాన్ సర్కార్' అనే నినాదంతో జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలి, అందుకనుగుణంగా ఇతర రాష్ట్రాల్లో బిఆర్ఎస్‌ను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయటం ద్వారా రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు తమ పార్టీని వేలెత్తి చూపకుండా ఉండాలన్నదే కెసిఆర్ వ్యూహమని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి రూ.లక్ష లోపున్న రైతు రుణాలను మాఫీ చేస్తామంటూ సిఎం కెసిఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్...తాను అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షల లోపున్న రుణాలను మాఫీ చేస్తామంటూ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. కానీ రైతులు కారు పార్టీ హామీనే నమ్మి ఓట్లేశారు. ఆ క్రమంలో సిఎం చెప్పినట్టు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసేందుకు వీలుగా సర్కారు జీవోను జారీ చేసింది. ఇది గడిచి నాలుగున్నరేండ్లు అయిం ది. అయితే రూ.35 వేల లోపున్న రుణాలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసింది. తద్వారా సుమారు 45 లక్షల మంది రైతులు లబ్ధిపొందారని అధికారులు ప్రకటించారు. అయితే రూ.35 వేల పైబడి, రూ.లక్ష లోపు రుణమున్న వారికి మాత్రం అప్పులు మాఫీ కాలేదు. వీరి రుణాల మాఫీ కోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.6,500 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కానీ నిధులను విడుదల చేయలేదు. ఇది ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోందని అధికార పార్టీ గ్రహించింది. ఈ నేపథ్యంలోనే రుణమాఫీ ప్రక్రియ ఊపందుకుంటోందని తెలిసింది. ఇది పూర్తయితే... దాంతోపాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, తద్వారా భూగర్భ జలాల పెరుగుదల, రైతు బంధు, రైతు బీమా తదితరాంశాలను ఎన్నికల సభల్లో ఏకరువు పెట్టటం ద్వారా అన్నదాతల మనస్సులను మరోసారి గెలుచుకోవాలనే పక్కా ప్లాన్‌తో బిఆర్ఎస్ బాస్ ముందుకెళుతున్నారు. అది కూడా కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేయకముందే, రుణ మాఫీ అంశాన్ని లేవనెత్తక ముందే రుణమాఫీని ప్రకటించి, అమలు చేయటం ద్వారా ఆ పార్టీ విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది ఆయన స్ట్రాటజీగా ఉండబోతోందని తెలిసింది.

విద్యుత్ సబ్సిడీతో 72.41 లక్షల మందికి లబ్ధి

- 27.48 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్
- ఐఅండ్‌పిఆర్ ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ సబ్సిడీల వల్ల 72.41 లక్షల మంది వినియోగదారులకు లబ్ధి చేకూరుతున్నదని సమాచార, పౌర సంబంధాల శాఖ వెల్లడించింది. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు మార్గనిర్దేశంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌రంగం వెలుగులు జిమ్ముతున్నదని పేర్కొన్నారు. స్వరాష్ట్రం వచ్చాక ఇప్పటి వరకు గృహ, వ్యవసాయ రంగాలకు రూ.50 వేల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చినట్లు తెలిపారు. 27.48 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నదని వివరించారు. రాష్ట్రం ఏర్పడిన అతి కొద్ది కాలంలోనే విద్యుత్ కోతలను అధిగమించి అన్ని రంగాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందనీ, దీనికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దార్శనికతే ప్రధాన కారణమని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు అమలు చేస్తున్న ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. 2014లో 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్ని, 2023 నాటికి 18567 మెగావాట్లకు పెంచగలిగారని చెప్పారు. ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు తొమ్మిదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.97,321 కోట్లను ఖర్చు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో అల్పాదాయ, బడుగు, బలహీనవర్గాలకు విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందనీ, నెలకు 0-50 యూనిట్స్ విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు 35 లక్షల 61 వేల 809 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. నెలకు 101 యూనిట్స్ లోపు విద్యుత్ వాడుతున్న షెడ్యూల్ కులాల వినియోగదారులు 1 లక్ష 25 వేల 433మంది ఉండగా, షెడ్యూల్డ్ తెగల వినియోగదారులు 2 లక్షల 95 వేల 114 మంది ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిపొందుతున్నారని తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితులను ఆదుకోవాలనీ, వారికి పునరావాస కార్యక్రమాలను తక్షణం చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టిఎజిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిడియం బాబురావు, పూసం సచిన్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.50వేలు సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల గ్రామాల మధ్య తెగిన రోడ్లను, కరెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరాశ్రయులైన వారందరికి కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.10వేలు ఆర్థిక సాయం తక్షణం అందించాలని విజ్ఞప్తి చేశారు. పంటలు నష్టపోయిన, రైతాంగానికి ఎకరాకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. వానలకు తడిసి కూలి పోయిన ఇండ్ల స్థానంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలి

- స్వయం ఉపాధి కోసం ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలి
- వికలాంగుల 'బంధు' ప్రవేశపెట్టాలి
- సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- వికలాంగుల సంఘాల సమన్వయ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని వికలాంగుల సంఘాల సమన్వయ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వాప్త పోరాటాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. వికలాంగుల సంఘాల సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. 5.16 లక్షల మందికి మాత్రమే ఆసరా పింఛన్లు వస్తున్నాయన్నారు. వికలాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భర్తీ చేస్తున్న అన్ని రకాల ఉద్యోగాల్లో వారికి నాలుగు శాతం కేటాయించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల హక్కుల చట్టం 2016, తెలంగాణ ప్రభుత్వం నియమాల ప్రకారం దళిత బంధు, గృహలక్ష్మి, డబుల్ బెడ్ రూమ్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, రూరల్, వ్యవసాయ, రైతు తదితర అన్ని పథకాల్లో వికలాంగులకు 5 శాతం తక్కువ కాకుండా రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 25 శాతం అధిక ఆర్థిక లబ్దిని కల్పించాలనీ, ఓహెచ్ వికలాంగులకు ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని శాఖల్లో గ్రూప్ 1,2, 3, 4 క్యాడర్ స్థాయిల్లో 4 శాతం అమలు చేయాలని కోరారు. ఆయా శాఖల్లో ఉద్యోగాలు గుర్తించి, అవసరమైన వెంటనే క్యారి ఫార్వార్డ్, సూపర్ న్యూమరి ద్వార వికలాంగులకు ఉద్యోగ కల్పనలో సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ సబ్ ఆర్డినేట్ సర్వీస్ రూల్స్‌ని సవరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, ఎన్‌పీడీఓ నాయకులు ఎం శ్రీనివాసులు, అందుల సంఘం నాయకులు గంగారాం, టీవీహెచ్‌ఎస్ నాయకులు జి కిరణ్, సెడ్ నాయకులు నారా నాగేశ్వరరావు, డిక్కి నుంచి శ్రీనివాస్‌గౌడ్, దివ్యాంగ్ మహా సంఘటన రమేష్, ఎన్‌డీడబ్ల్యుఏ లింగస్వమి,టీఎండీఏ రవికుమార్, రోస్టర్ సాధన కమిటీ నాయకులు గణేష్, మరుగుజ్జుల సంఘం నాయకులు గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ హామీలేంటో చూద్దాం

- నేడు రాష్ట్ర కేబినెట్
- ప్రతిష్టాత్మక అంశాలపై చర్చించనున్న మంత్రివర్గం
- 'ఎన్నికల కోణం'లోనే కొనసాగనున్న భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభకు త్వరలో నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులను కెసిఆర్ సన్నద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పలు కీలక నిర్ణయాలను వెలువరించనున్నారు. అందుకోసమే రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా భేటీ కానుంది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని పలు అంశాలను కూడా అమలు చేసి చూపించామంటూ కెసిఆర్ చెబుతూ వస్తున్నారు. తమను ప్రతీ ఎన్నికల్లోనూ ఓటర్లు ఆదరించటానికి ఇదే ప్రధాన కారణమంటూ ఆయన పునరుద్ఘాటిస్తున్నారు. అయినా వివిధ తరగతులు, పలు వర్గాలకు చేయాల్సిన పనులు ఇంకా మిగిలే ఉన్నాయని ఇటు ప్రతిపక్షాలు, అటు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వాటిపై ప్రభుత్వం కూడా విమర్శలపాలవుతూ ఉన్నది. ఈ నేపథ్యంలో గతంలో హామీ ఇచ్చి... అమలు కాకుండా పోయిన ముఖ్యమైన, ప్రజలకు అత్యంత అవసరమైన, వారికి తక్షణం లబ్ది చేకూర్చే అంశాలపై దృష్టి సారించాలంటూ సీఎం... మంత్రులను ఆదేశించారు. అలాంటి విషయాలను మంత్రివర్గంలో చర్చించి, తక్షణమే నిర్ణయాలను వెలువరిద్దామంటూ ఆయన వారికి సూచించినట్టు తెలిసింది. ఇందుకనుగుణంగా క్యాబినెట్‌కు సన్నద్ధమై రావాలంటూ మంత్రులను కెసిఆర్ ఆదేశించారు.

ఈ క్రమంలో సోమవారం నిర్వహించబోయే క్యాబినెట్... ఫక్తు ఎన్నికల కోణంలోనే కొనసాగబోతోందని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో ఏయే అంశాలను చేర్చబోతోంది..? కర్నాటకలో ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైనవి ఏవి..? వాటిని హస్తం పార్టీ కంటే ముందుగానే ఇక్కడ ప్రభుత్వం తరపున ప్రకటిస్తే ఎలా ఉంటుందనే అంశాలపై కెసిఆర్ సీరియస్‌గా దృష్టి సారించనున్నారు. ఇలాంటి కీలకాంశాల ఆధారంగా కేబినెట్‌లో చర్చ కొనసాగనుందని తెలిసింది. మొత్తం 40 నుంచి 50 ముఖ్యమైన అంశాలపై మంత్రివర్గంలో చర్చించి.. నిర్ణయాలను ప్రకటిస్తామంటూ ముఖ్యమంత్రి కార్యాలయం ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. వాటిలో ప్రధానంగా రైతులకు రుణమాఫీ, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆర్‌టిసి ఉద్యోగులకు జీత భత్యాల పెంపు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతన సవరణ (పీఆర్సీ), మధ్యంతర భృతి (ఐఆర్), ఉపాధ్యాయుల హేతుబద్ధీరణ తదితరాంశాలపై కేబినెట్ భేటీలో చర్చిస్తారు. సాధ్యాసాధ్యాలు, ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుని నిర్ణయాలను ప్రకటించే అవకాశముందని ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఇప్పటికిప్పుడు ఓట్లు గుమ్మరించే పథకాలు, కార్యక్రమాలకు మంత్రివర్గం అధిక ప్రాధాన్యతనిచ్చి... పచ్చజెండా ఊపనుందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే 2014లో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సమయంలో కెసిఆర్... దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య తదితర హామీలనిచ్చారు. ఇవి పేరుకే ఉన్నాయి తప్ప పూర్తి స్థాయిలో అమలు కాలేదన్న విమర్శలు ఎప్పటి నుంచో వెల్లువెత్తుతున్నాయి. వీటితోపాటు 2018లో ముందస్తు ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ ఇది ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య కూడా ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉంది. ఎన్నికలకు ముందు అసెంబ్లీ సమావేశాల (ఒకరకంగా ఎలక్షన్లకు ముందు ఇదే చివరి సెషన్ కావొచ్చు)ను నిర్వహించబోతున్న గులాబీ దళపతి... ఇలాంటి పెండింగ్ అంశాలపై ఎలాంటి నిర్ణయాలను వెలువరిస్తారో చూడాలి. మరోవైపు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించబోయే కేబినెట్ భేటీకి మంత్రులంతా సిద్ధమవుతున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం వద్ద గోదావరి నదిలో ఆదివారం ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 49.50 అడుగులు ఉన్నది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు ఎత్తివేశారు. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నది. ఇంకా వరద కొనసాగుతుండడంతో అధికారులు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. ప్రస్తుతం జలాశయానికి ఇన్‌ఫ్లో 8,100 క్యూసెక్కులు వస్తున్నది. అవుట్ ఫ్లో 8100 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 83.81 టిఎంసిలు కాగా.. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90 టిఎంసిలు. అలాగే కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సైతం ప్రవాహం తగ్గింది. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు ఉండగా.. అదే మొత్తం నీటిని దిగువకు వదులుతున్నారు. నీటి నిల్వ సామర్థ్యం 17.34 టిఎంసిలు కాగా.. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 17.80 టిఎంసిలుగా ఉంది.

విమానాశ్రయంలో 1.329 కిలోల బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఆర్‌జిఐ ఎయిర్‌పోర్టులో ఆదివారం హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రయాణికుడు చెన్నై నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు. అయితే, విమానం అంతకు ముందు అబుదాబి నుంచి చెన్నైకి ప్రయాణించింది. ఆ సమయంలో వెనుక టాయిలెట్‌లోని వాష్ బేసిన్ కింద ప్రయాణికుడు బంగారం పేస్ట్ దాచాడు. కస్టమ్స్ సుంకం చెల్లింపును ఎగవేసి ఎయిర్‌పోర్ట్ నుంచి రహస్యంగా బంగారం పేస్ట్‌ను రవాణా చేయడానికి ప్రయత్నించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు అతన్ని తనిఖీ చేశారు. ప్యాంట్ పాకెట్లలో దాచిన 1329 గ్రాముల బంగారం పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.81.6 లక్షలు ఉంటుంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమీషన్ల 'కాకతీయ' : డికె అరుణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మిషన్ కాకతీయను కమీషన్ల కాకతీయగా మార్చారని మాజీ మంత్రి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆమె ఆదివారం పర్యటించారు. వరద బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ.. చెరువుల అభివృద్ధి పేరుతో నాసిరకం పనులు చేపట్టారని దుయ్యబట్టారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన గుడిసెవాసులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్, హన్మకొండ నగరాల్లోని ముంపు ప్రాంతాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్యతో కలిసి చెరుపల్లి సందర్శించారు. హన్మకొండ నగరంలోని గోపాలపురం చెరువు ప్రాంతంలో భారీ వర్షాలకు గుడిసెలు కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద కాలువను భద్రకాళి చెరువులోకి మళ్లిస్తే గోపాలపురం చెరువుకు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. అధికారులు ఈ విషయం తెలిసినా, అలా చేయకుండా వరదను ఇటు మళ్లించడంతో గుడిసెలు కొట్టుకుపోయాయని తెలిపారు. వరద ముంపు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో బాధితుల ఇబ్బందులను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రధానికి పట్టింపేది..? : ఎస్. వీరయ్య

రాష్ట్రంలో భారీ వర్షాలతో అనేక గ్రామాలు, నగరాలు మునిగినా ప్రధాన మంత్రికి పట్టింపు లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య విమర్శించారు. తాము బాధితులను పరామర్శించే వరకు కూడా అధికారులు ఈ ప్రాంతాలను సందర్శించకపోవడాన్ని తప్పుపట్టారు. మడికొండ రైల్వే ట్రాక్ కింద కల్వర్ట్ వెడల్పు పెంచితే ఎంఎన్ నగర్ మునిగేది కాదన్నారు. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో రూ.474 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ఏ ప్రాంతంలోనూ పరిశీలించకుండానే అధికారులు ఏ ప్రాతిపదికన నష్టాన్ని అంచనా వేశారని ప్రశ్నించారు. మడికొండ ఎంఎన్ నగర్‌లో బాధిత మహిళల రోదన హృదయవిదారకంగా ఉందన్నారు. భద్రకాళి చెరువును టూరిజం స్పాట్ చేయడానికి చెరువు చుట్టూ గోడ కట్టి కట్ట వద్ద వదిలేశారని, దీంతో అదే ప్రాంతంలో గండి పడి పలు కాలనీలు మునగిపోయాయని చెప్పారు. పోతననగర్‌లో చాలా ఇండ్లు కూలిపోయాయన్నారు. భారీ వర్షాలతో కూలిపోయిన పేదల ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, సారంపల్లి వాసుదేవరెడ్డి, టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, మిశ్రిన్ సుల్తాన తదితరులు ఉన్నారు.

సఫాయన్నల కష్టాలు చర్చకొచ్చేనా?

- క్యాబినెట్, అసెంబ్లీ సమావేశాలవైపు ఆశగా ఎదురుచూపు
- మల్టీపర్పస్ వద్దంటున్న జిపి కార్మికులు
- పర్మినెంట్ హామీనే ప్రధాన డిమాండ్
- నేడు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పల్లెలకు గ్రామపంచాయతీ కార్మికులే బ్రాండ్ అంబాసీడర్లు. ఊరి కంపునంతా భరిస్తూ శుద్ధి చేస్తున్నారు. మన ఊర్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు. అవార్డులు వచ్చేలా కష్టపడుతున్నారు. చుట్టపోడు చచ్చినా.. పండుగొచ్చినా.. పబ్బమొచ్చినా ఊరు మొఖం చూసి సెలవులు తీసుకోకుండా శ్రమిస్తున్నారు. ఇంత చేస్తున్నా వాళ్ల కష్టాన్ని పాలకులు గుర్తించడం లేదు. ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులకు పిఆర్‌సి కింద 30 శాతం వేతనాలు పెంచిన రాష్ట్ర సర్కారు జీపీ కార్మికులకు మాత్రం వెయ్యి రూపాయల వేతనం పెంచి గొప్పలు చెప్పుకుంటున్నది. 90 శాతం నిరక్షరాస్యులు.. ఆపై దళితులు అయినందువల్లో ఏమోగానీ వారిని చిన్నచూపే చూస్తున్నది. తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. బెదిరిస్తున్నది. సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ల ముట్టడికి జెఎసి పిలుపునిచ్చింది. ఇదే సమయంలో క్యాబినెట్ జరుగుతుండటంతో తమ పట్ల రాష్ట్ర సర్కారు సానుకూలంగా స్పందిస్తుందని కొండంత ఆశతో గ్రామపంచాయతీ కార్మికులు ఎదురుచూస్తున్నారు. వారి ఆశల్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంత వరకు నెరవేరుస్తుందో చూడాలి.

రాష్ట్రంలో 12769 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ లెక్కల ప్రకారం 36,500 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.8,500 వేతనం

ఇస్తున్నది. మేడే సందర్భంగా వెయ్యి రూపాయలు పెంచింది. వాస్తవానికి గ్రామాల్లో పంచాయతీ కార్మికుల సంఖ్య 50 వేల వరకు ఉంది. ప్రభుత్వం మాత్రం అధికార లెక్కల ప్రకారమే వేతనాలు ఇస్తున్నది. దీంతో ఆ వేతనాలనే క్షేత్రస్థాయిలోని కార్మికులందరూ పంచుకుంటున్నారు. దీంతో వారికి నెలకు నాలుగైదు వేల రూపాయలకు మించి రావడం లేదు. ఈ అరకొర వేతనాలతో బతకలేకనే పంచాయతీ కార్మికులు సమ్మెలోకి దిగారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయమంటున్నారు...

గతంలో ప్రతి ఊరిలోనూ సఫాయి కార్మికులు, చెత్త సేకరించేవారు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు ఉండేవారు. ఎవరి పని వారే చేసేవారు. ప్రస్తుతం మల్టీపర్పస్ విధానంలో అన్ని పనులనూ కార్మికులతోనే చేయిస్తున్నారు. దీంతో వారు ప్రమాదాలకు గురై చనిపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పారిశుధ్య కార్మికుడ్ని బలవంతంగా విద్యుత్ స్తంభం ఎక్కించగా కరెంట్ షాక్‌కు గురై మరణించిన విషయం విదితమే. నల్లగొండ జిల్లా వేములపల్లి, మిర్యాలగూడ, సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలాల్లో ట్రాక్టర్ డ్రైవింగ్ పట్ల అనుభవం లేక కార్మికులు చనిపోయిన విషయం తెలిసిందే. ఇలా రాష్ట్రంలో 200 మందికిపై పంచాయతీ కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఆ కుటుంబాలన్నీ నేడు రోడ్డున పడ్డాయి.

సామాజిక భద్రత అడగటం నేరమా?

చెత్తసేకరణ, మోరీలు తీయడం వంటి రోజువారీ విధులతో జీపీ కార్మికులు తరుచూ రోగాలపాలవుతున్నారు. సొంత ఖర్చులతోనే వైద్యం చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే తమకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. గతంలో జానారెడ్డి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో వారికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తూ సర్క్యులర్ జారీ చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో అమల్లోకి రాలేదు. 2015లో సమ్మె సందర్భంగా పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామని మంత్రి కేటీఆర్ హామీనిచ్చారు. ఎనిమిదేండ్లవుతున్నా అతీగతీ లేదు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని తమకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

వెనుబడ్డోళ్లు కాబట్టి సర్కారు పట్టించుకోవడం లేదా?

పంచాయతీ కార్మికులు వెనుకబడ్డోళ్లు, చదువురానోళ్లు అని రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఈ ధోరణి సరిగాదు. వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలి. ఇవి తమ వల్ల అవుతాయి. మిగిలినవి భవిష్యత్‌లో పరిష్కరిస్తాం అని సర్కారు చెబితే సరిపోతుందికదా? ఈ నాన్చివేత ధోరణి ఎందుకు? ఉద్యోగులందరికీ వేతనాలు పెంచారు మంచిదే. మేమేమీ వద్దనట్లేదు. పంచాయతీ కార్మికులకు వెయ్యి రూపాయలు పెంచి మేం పెంచాం..మేం పెంచాం అని సీఎం, మంత్రి చెప్పుకోవటం ఏం బాగోలేదు. పీఆర్సీ నివేదిక చెప్పిన కనీస వేతనం పంచాయతీ కార్మికులకు కూడా వర్తింపజేయాలి కదా. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలి. ఈ డిమాండ్లను నెరవేర్చేదాకా పోరాటం కొనసాగుతుంది.

గ్రామ పంచాయతీ కార్మికులు,
ఉద్యోగుల జెఎసి చైర్మెన్ పాలడుగు భాస్కర్